క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

సాక్షినెట్‌వర్క్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి ఏర్పాటు చేయనుంది. నేటి సోమవారం మొదటిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల నుంచి సమస్యలను స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కొనసాగే ఈ కార్యక్రమాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయదలిచినవారు పాల్గొనవచ్చు. భద్రాచలం, మణుగూరు నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లోని విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో స్థానిక సబ్ డివిజన్ ఆఫీస్, అకౌంట్స్ ఆఫీస్, అశ్వారావుపేట, వినాయకపురం, దమ్మపేట, గండుగులపల్లిలోని 33/11కేవీ సబ్ స్టేషన్లలో కార్యక్రమం నిర్వహిస్తారని అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.

20న సొసైటీలో వేలం

చర్ల: చర్లలోని ప్రథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి ఈ నెల 20న ఓ ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ యంత్రపరికరాలను వేలం వేయనున్నట్లు సహకార సంఘం కార్యదర్శి ఎస్‌డి.జిలానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ 20 ఏపీ 1613 మోడల్ నెంబర్ 2012 గల ఐచర్ 380, శక్తిమాన్ రోటావేటర్, సీడ్‌డ్రిల్‌లు విడివిడిగా ఎలా ఉన్నవి అలా బహిరంగ వేలం ద్వారా ఈ నెల 20న ఉదయం 11 గంటలకు చర్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ట్రాక్టర్ కోసం రూ.15 వేలు, రోటావేటర్ కోసం రూ.5 వేలు, సీడ్‌డ్రిల్ కోసం రూ 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని యన కోరారు. వేలంలో యంత్ర పరికరాలను దక్కించుకున్న వారు 70 శాతం సొమ్మును అదే రోజు చెల్లించవలసి ఉంటుందని మిగిలిన సొమ్మును చెల్లించి యంత్ర పరికరాలను తీసుకొని వెళ్ల వచ్చునని ఆయన తెలియజేశారు.

21 నుంచి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ క్రీడా పాఠశాల్లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మణుగూరు ఎంఈఓ వీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాల కోసం మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలన్నారు. 21న మండల స్థాయిలో జరిగే క్రీడాపోటీలకు విద్యార్థిని, విద్యార్థులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డ్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి వయస్సు, జన్మదిన సర్టిఫికెట్, మూడో తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్ కుల ధృవీకరణ పత్రంతో 10 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో తమ వెంట తెచ్చుకోవాలన్నారు.

బూర్గంపాడులో భారీ వర్షం

బూర్గంపాడు: మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. గాలితో కురిసిన వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గాలి తీవ్రతకు కొన్నిచోట్ల ఇళ్లపై రేకులు లేచిపోయాయి. ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు భారీ వర్షంతో సేదతీరారు. పత్తి విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

మెచ్చా జన్మదిన వేడుకలు

దమ్మపేట: బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్, గాజుబోయిన యేసు, అబ్దుల్ జిన్నా, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీను, బుడే, రూపా రాంబాబు, జలగం మనోజ్, శేషాద్రి పాల్గొన్నారు.
అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అశ్వారావుపేటలో ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం శ్రీనగర్‌లో చార్‌ధాం యాత్రలో అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో కూడా కేక్ కట్ చేసి యాత్రికులకు పంచారు. అలాగే అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు తాడేపల్లి రవి, గుడవర్తి వెంకటేశ్వరరావు, తాళం సూరి, నక్కా రాంబాబు, సోమాని రమేష్, బజారయ్య పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. అనంతరం డాన్ టూ డస్క్ సేవలో భాగంగా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు భద్రాచలం రామాలయంలో శ్రీరామ కోటి లేఖన వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ కో ఆర్డినేటర్ బండారు నరసింహ రావు, విశ్వనాథ్ గుప్తా, రేపాక శ్రీనివాస్, చారుగుళ్ల శ్రీనివాస్, తోకల నాగేశ్వరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్యప్రదం

- సమీపిస్తున్న సీజనల్ వ్యాధుల కాలం
- అవగాహన కార్యక్రమాలు, పారిశుధ్య పర్యవేక్షణతో మేలు
- ఆరోగ్య, పంచాయతీ అధికారుల చర్యలు అనివార్యం



నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి మధు, సిబ్బంది

కరకగూడెం: వర్షాకాలం వచ్చిందంటే అంటువ్యాధుల సీజన్ ప్రారంభమైనట్టే. పైగా వారంరోజులుగా మండలంలో భిన్నవాతావరణంతో సీజనల్ వ్యాధులకు బీజంపడే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలకు గూర్చి వైద్యశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ముసిరే సమయం ఆసన్న మైందని జూన్ నెల నుంచి ఐదు మాసాలు చాలా కీలకమని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో వివిధ రకాల వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది.ప్రస్తుతం వానాకాలం, ఆ తర్వాత వచ్చే చలికాలంలో మరింత అప్రమత్తత అవసరమని వారు సూచిస్తున్నారు. వైద్య, పంచాయతీ శాఖల సమన్వయంతో వ్యాధుల కట్టడికి చర్యలు చేపడితే సత్ఫలితాలను ఆశించే వీలుంది.

అధికారుల స్పందనే కీలకం..

సీజనల్ వ్యాధులు సోకకుండా అధికారులు స్పందన కీలకం. ముఖ్యంగా డెంగీ కేసులు విస్తృతం అవకుండా జాగ్రత్తలు తప్పనిసరి. ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ కారణంగా సమస్య తప్పడం లేదు. తాగి పడేసేన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, చిప్పలు ఈ దోమలకు అనువుగా ఉంటున్నాయి. వీటిలో నీరు చేరి డెంగికి కారణమయ్యే దోమ వృద్ధి చెందుతుంది.వర్షాకాలంలో, పల్లెల్లో మురుగు నీరంతా మడుగులు కట్టి దోమల విజృంభణకు కారణమవుతోంది. ఈ క్రమంలో స్థానిక ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, ఫ్రైడే డ్రైడేలను పకడ్బందీగా నిర్వహించాల్సి ఉంటుంది.

చేపట్టాల్సిన చర్యల్లో కొన్ని..

- నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేసి, దోమల లార్వాను నియంత్రించాలి.
- మురుగు కాల్వలు పూడిక తీయించి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- గ్రామాలు, కాలనీల్లో తరచూ బ్లీచింగ్ చల్లాలి.
- ముందస్తుగా జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవాలి



సీజనల్ వ్యాధులు ప్రబలే తరుణంలో పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పట్టించుకుని చెత్తా చెదారం లేకుండా చూడాలి. వీధులన్నీ శుభ్రం చేయాలి. తరచూ బ్లీచింగ్ చల్లుతూ నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలి. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదు.

– చెన్నూరు రావన్, చొప్పల

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో విస్తృతంగా ఆరోగ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఆరోగ్యం పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఊకే నాగమణి, పద్మాపురం

నియంత్రణకు సిద్ధంగా ఉన్నాం..



సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలున్న వారు వెంటనే వైద్యం పొందాలి. ప్రస్తుతం ఏ చిన్న లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య శాఖ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉన్నాం.

– కారం మధు, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఆదివారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులతో ఏఎస్పీ పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం మత సామరస్యానికి ప్రతీకని తెలిపారు. నేడు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి విశ్వహిందు పరిషత్ సభ్యులు వినతిపత్రం అందించారు. సమావేశంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్, ఏఎస్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మండల పరిధిలోని విప్పలసింగారం గ్రామపంచాయితీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులైన రూ.18లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ఏడు సీసీ రోడ్లను ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. తొలుత గ్రామస్తులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, పిఆర్ ఏఈ రామారావు, మిషన్ భగీరథ ఏఈ అరుంధతి, విద్యుత్‌శాఖ ఏఈ వేణుగోపాల్, ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలకు సిద్ధం కావాలి

మణుగూరురూరల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ముద్దా బిక్షం, ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ మధుసూధన్‌రెడ్డి, షేక్ యాకుబ్‌షావలిలు పిలుపునిచ్చారు. ఆదివారం మణుగూరు పట్టణంలోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్టూ ఏరియా ఐదో మహాసభ నిర్వహించారు. తొలుత ఇఫ్టూ ఏరియా అధ్యక్షులు జెల్లా అశోక్ జెండా ఎగురవేసి అమర వీరులకు నివాళ్లర్పించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరైన నేతలు ముద్దా బిక్షం, మధుసూధన్‌రెడ్డి, యాకుబ్‌షావలిలు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచాలని, కార్మిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ.. పర్మినెంట్ కార్మికుల సంఖ్యను తగ్గిస్తున్నారని విమర్శించారు. మహాసభలో ఇఫ్టూ జిల్లా నాయకుడు జి.మల్సూర్, మిట్టపల్లి రాజేందర్, ఏరియా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, పి.లక్ష్మీనారాయణ, ఆర్.వెంకటేశ్వర్లు, విజయ్, వి.జానయ్య, జె.యాకయ్య, పి.సంజీవరెడ్డి, పి.నరసింహారావు, ఆర్.బిక్షం, నరసమ్మ, సరస్వతి, సంపత్, భాస్కర్, రామకృష్ణ, సంజీవ, ధనుంజయ్ పాల్గొన్నారు.

గ్యారెంటీలను అమలు చేస్తున్నాం



చంద్రుగొండలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ: ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేస్తున్నామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. ఆగస్టు నెలలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ రుణాల మాఫీ చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ సాధించడంలో కార్యకర్తల కృషి ఫలితమేనన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాలభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, దారం గోవింద రెడ్డి, గాదె శివప్రసాద్, కృష్ణారెడ్డి, ఉప్పతల ఏడుకొండలు పాల్గొన్నారు.

దమ్మపేట మండలంలో పర్యటన

దమ్మపేట: మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన గోనే సుబ్బాయమ్మ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. చలమప్పగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బండారు నాగలక్ష్మిని పరామర్శించి, ఉచిత వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. సీతారాంపురం గ్రామంలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న కామినేని వెంకటేశ్వర్లును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నాచారం గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన పోతుకుంట్ల కృష్ణవేణి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. నాచారం గ్రామంలో నూతనంగా తాగునీటి కోసం వేసిన మోటారు బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ మహిళా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జయ కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోగల ఎంపీసీ, ఎపీసీఎస్, బీజడ్సీ, బీఏ, బీకాం, బీకాం(సీఏ) గ్రూపుల్లో ప్రథమ సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. ఈ నెల 17నుంచి 23వ తేదీ వరకు కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు అర్హత ఉన్న గిరిజన విద్యార్థినులు హాజరు కావొచ్చని సూచించారు.

బియ్యం వితరణ

అశ్వాపురం: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సెక్యూరిటీ ఉద్యోగి బండారి జయరాజు తన తండ్రి వీరస్వామి జ్ఞాపకార్థం ఆదివారం మండల కేంద్రంలోని ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గట్టయ్య యాదవ్, జయరాజు వారి కుటుంబ సభ్యులు, సింగరేణి సేవా సమితి సభ్యుడు ఎస్‌డి.నాజర్‌పాషా, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అమీనుద్దిన్, వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమం నిర్వాహకులు షహనాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

కోతులను తరమండి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగులో కోతుల నుండి విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోతులు పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయని, కోతుల దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా ఉందని చెబుతున్నారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలపై తరచూ కోతులు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అశ్వారావుపేట మండల పరిధిలోని పంచాయతీ కార్మికులు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యే జారేను, అశ్వారావుపేట గ్రామ పంచాయితీ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు, సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.26,000లు చెల్లించి, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ సౌకర్యాలను కల్పించాలని కోరారు.

బస్సు ఏర్పాటు చేయండి

మణుగూరురూరల్: మండలంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సుదూరు ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం బస్ సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేయాలని బీబీజీకేఎస్ మణుగూరు బ్రాంచ్ ఇన్‌చార్జ్ నాగెళ్లి పాఠశాల యాజమాన్యాన్ని ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివాసీ జేఏసీ కమిటీ ఎన్నిక

మణుగూరుటౌన్: మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క సారలమ్మ గుడి ప్రాంగణంలో స్థానిక ఆదివాసీ సంఘాలు ఆదివారం సమావేశం నిర్వహించి ఆదివాసీ జేఏసీ అడహక్ కమిటీ ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షుడు సోడె రవికుమార్ దొర తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రధాన సమస్యలైన ఆదివాసీ మహిళలకు, ఉద్యోగుల సంరక్షణకు కార్యాలయాల్లో మహిళలపై వేధింపులకు రక్షణగా కమిటీ ఏర్పాటు, ఆదివాసీ ఉప తెగల విద్యా అవకాశాల కల్పనకు ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు, ఆదివాసీలకు శిక్షణ 100 శాతం ఉద్యోగ కల్పన వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షుడిగా సోడె రవికుమార్ దొర, ఉపాధ్యక్షులుగా ఇర్ప రవికుమార్, గనిబోయిన ముత్తయ్య, పూనెం రమేశ్, ప్రధాన కార్యదర్శి వాగబోయిన శ్రీను, సహాయ కార్యదర్శిగా పాయం నాగరాజు, కారం నర్సింహారావు, కార్యదర్శి పూనెం నాగరాజు, కోశాధికారిగా జోగ సురేంద్ర ప్రసాద్‌తో పాటు నలుగురు సభ్యులతో పాటు గౌరవ సలహాదారులుగా మరో ఆరుగురిని ఎన్నుకున్నామని తెలిపారు.

వర్ధంతి సభలు.. దశదిన కర్మ



గుండాల: బాటన్న స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ములకలపల్లి: తెలంగాణా ఉద్యమకారుడు పాలకుర్తి ప్రసాద్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలపరిధిలోని పాగళ్లపల్లిలో ఆదివారం జరిగిన ప్రసాద్ దశదిన ఖర్మలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కుటుంసభ్యులకు తన ప్రగాఢ సానుభూతికి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, రత్నభూషణం తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వేర్వేరుగా నివాళులర్పించారు.

గుండాల: అజ్ఞాత ఉద్యమ నేత, దివంగత జెడ్పీటీసీ బాటన్న ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పోరాడాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి అరెం నరేష్ పిలుపునిచ్చారు. బాటన్న 11 వర్ధంతి సందర్భంగా ఆదివారం బాటన్న స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం ఆయన చేసిన త్యాగాలు మరువ లేనివని అన్నారు. కార్యక్రమంలో ఈసం కృష్ణ, కోరం సీతారాములు, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, పర్శిక రవి, ఈసం కృష్ణ, వూకె బాబు, పెంటన్న, గోపాల్, ఎల్లన్న, నర్సన్న, అశోక్, అజ్జర్, లాలు, తదితరులు పాల్గొన్నారు.

చర్ల: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నానమాద్రి కృష్ణార్జునరావు ఎంతగానో పరితపించారని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ తడికెల శివకుమార్ అన్నారు. బీఎస్పీ దివంగత జిల్లా అధ్యక్షుడు, స్ఫూర్తి పౌండేషన్ వ్యవస్థాపకులు, నానమాద్రి కృష్ణార్జునరావు 2వ వర్ధంతి సభ ఆదివారం మండల కేంద్రమైన చర్లలో నిర్వహించారు. కృష్ణార్జున రావు చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్ధంతి సభలు పలువురు మాట్లాడుతూ.. కృష్ణార్జునరావు పేదల అభ్యున్నతి కోసం నిత్యం పరితపించారని అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి కొప్పుల నారాయణ, నాయకులు మైసా శేఖర్, చింతల నవీన్, టింగా సందీప్, తడికల అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి మండల సమస్యలు

గుండాల: మండలంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీపీ ముక్తి సత్యం తెలిపారు. ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అందులో భాగంగా ముత్తాపురం నుంచి పెద్దతోగు వరకు బీటీ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరామని తెలిపారు. కాచనపల్లి ప్రాంతంలో పోడు సాగురైతులపై ఫారెస్టు అధికారుల దాడులు నిలిపివేయాలని, కందకాలు తవ్వొద్దని విన్నవించారు. కొడవటంచ కిన్నెరసాని వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పోడు హక్కుపత్రాలలో త్రీఫేజ్ కరెంటుకు దరఖాస్తులు చేసుకుంటున్న రైతులను ఫారెస్టు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పెద్దతోగు గ్రామస్తులు ఉన్నారు.

బాధితులకు చేయూత

దుమ్ముగూడెం: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఊయిక బాలరాజు ఇళ్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోగా.. బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా ఆదివారం సహాయం అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఇచ్చే వంట పాత్రలు బట్టలు టార్పాలిన్ రూ.3వేల నగదును అందజేశారు. ఇలాంటి విపత్తులు జరిగినప్పుడు ముందుకు వచ్చిన సంస్థను ఎమ్మెల్యే అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ యోగి సూర్యనారాయణ, లైయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, సీనియర్ లయన్ మెంబర్ బిల్లిపెల్లి రంగారెడ్డి, నాగరాజు, ఎండి.నవాబు, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆశ్రమ వార్షికోత్సవం

దమ్మపేట: మండల కేంద్రంలోని శ్రీగాయత్రి ఆశ్రమ వార్షికోత్సవ వేడుకలను ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తిజీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో గాయత్రి మాతకు దివ్యంగా అలంకరణ చేసి, అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గాయత్రి హోమాన్ని ఆశ్రమ అర్చకులచే వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

తునికాకు బోనస్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిడియం బాబురావు

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం డివిజన్‌లో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న తునక బోనస్‌తో పాటు ఆదివాసీ గిరిజనులకు పోడు భూముల పట్టాలు మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మీడియం బాబురావు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో ఆదివారం జరిగిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో ఏళ్ల నుంచి తునికాకు బోనస్ కొంత మందికి మాత్రమే పరిమితమైందని ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో వైద్య బృందాలు పర్యటించి ముందస్తుగా మెడికల్ క్యాంపులు నిర్వహించి రక్తపరీక్ష నమూనాలు సేకరించి మెరుగైన వైద్యం అందించాలని సీజనల్ వ్యాధుల నుంచి గిరిజనులను రక్షించాలని తెలిపారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శిగా కారం పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడిగా గౌరీ నాగేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సోయం జోగారావు, సున్నం గంగా, మడివి రమేష్, కుంజా శ్రీను, నరసింహారావు, మడకం గోవింద్, కారం నరేష్, మడకం సతీష్, నానారావు, పూనెం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ వీఆర్ఓ మృతి

చర్ల: మండలంలోని కుర్నపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ వీఆర్ఓ ఇర్పా నాగేశ్వరరావు(49) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. నాటి ప్రభుత్వం వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేయడం, ఆయనకు ఇతర ఏ శాఖా కేటాయించకపోవడంతో మనోవేదనకు గురై అనారోగ్యం పాలయ్యాడని, వైద్యఖర్చులకు ఇబ్బందులు పడ్డాడని తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.